క్లుప్తంగా

సామాజిక సేవ ప్రతి ఒక్కరి బాధ్యత



కంకిపాడు: సామాజిక సేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని లయన్స్‌క్లబ్ ఆఫ్ కంకిపాడు అధ్యక్షుడు వి.శివరామకృష్ణ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పేదలకు చాపలు, దుప్పట్లు, దుస్తులు శనివారం పంపిణీ చేశారు. శివరామకృష్ణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తుందన్నారు. గ్రామీణులకు అవసరమైన విద్య, వైద్యం సమర్థంగా అందేలా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మద్దుల గోవిందరావు, చవట శంకర్‌రావు, కొల్లిపర సీతారాంబాబు, వందనపు వెంకట విజయ, జంగాల సంధ్య, జంగాల వైదేహి, కొల్లిపర రోజా తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కంకిపాడు: అన్నార్తులను ఆదుకోవాలని అక్షర యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కె.శివయ్య కోరారు. కంకిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద వృద్ధులు, దివ్యాంగులు 30 మందికి బియ్యం, సబ్బులు, కూరగాయలు శనివారం పంపిణీ చేశారు. శివయ్య మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పేదలకు అండగా నిలవాలని, అభాగ్యులకు చేయూత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టి.వజ్రకుమారి, గాడ్ హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు ఎంఎస్ రాజు, మాజీ ఎంపీటీసీ కొండా నాగేశ్వరరావు, ప్రతినిధులు వెంకటేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, శివ భాస్కర లక్ష్మి, పండ్ల వ్యాపారులు పాల్గొన్నారు.

సహస్ర నామార్చన



గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేంచేసియున్న సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శనివారం తమలపాకులతో సహస్రనామార్చనలు నిర్వహించారు. కార్తిక మాసం శ్రవణ నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు ఎస్. రామాచార్యులు నేతృత్వంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాలయంలోని శ్రీఅంజనేయస్వామి వారికి 11 వేల తమలపాకులతో సహస్రనామార్చనలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గోవింద నామాలు, శంకుచక్రం తదితర రూపాల్లో కార్తిక దీపాలను భక్తులు వెలగించి పూజలు చేశారు. పలువురు గ్రామ ప్రముఖులు, పరిసరా ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం



పెనమలూరు: చోడవరం - పెనమలూరు ఆర్అండ్ బీ రహదారి మరమ్మతు పనులకు ఎమ్మెల్యే బోడెప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. చోడవరం నుంచి పెనమలూరు వరకు ఉన్న ఆర్‌డీఅండ్ బీ రహదారి దాదాపు ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరించి ఉంది. అయితే రహదారి ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గుంతల మయంగా మారింది. దీంతో రూ.1.50 కోట్లతో రహదారి మరమ్మతుల నిర్వహణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో రహదారులు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం సర్పంచి కాకర్ల వెంకటరత్నం, పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోయా ఆనంద్‌ప్రసాద్, పంచాయతీ వార్డు సభ్యులు పలువురు పాల్గొన్నారు.

మహా సత్సంగం విజయవంతం చేయాలి



కంకిపాడు: ప్రముఖ యోగా గురువు శ్రీ రవి శంకర్ సమక్షంలో ఈనెల13న నిర్వహించే మహా సత్సంగం విజయవంతం చేయాలని కోరుతూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు శనివారం కంకిపాడులో ప్రదర్శన, బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో విజయవాడ భవానీపురంలో నిర్వహించే మహా సత్సంగం విజయవంతం కోరుతూ ప్రచారం చేశారు. సత్సంగంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు యర్రపోతు రామకృష్ణ, కాగితం భువన, జి.శివరామకృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత

- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- సౌకర్యాలు కల్పించకపోగా ఉన్న సౌకర్యాలు ఎత్తివేతపై విస్మయం
- కలగానే ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్



హనుమాన్‌జంక్షన్ పరిధిలోని నూజివీడు రైల్వే స్టేషన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో సరుకు, ప్రయాణికుల రవాణాలో ఎంతో ఆదరణ కలిగిన హనుమాన్ జంక్షన్‌లోని నూజివీడు రైల్వే స్టేషన్ అభివృద్ధి ఆమడదూరంలో ఉంది. ప్రయాణికుల ఆదరణ మెండుగా ఉన్నా రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధుల ఉదాసీన వైఖరితో కూనారిల్లుతోంది. రైల్వే టికెట్ రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరణ, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఏర్పాటు, మౌలిక సదుపాయాల మెరుగు వంటి సమస్యలు ఇక్కడ తిష్టవేశాయి.

టికెట్ కౌంటర్ నిలుపుదల..

నూజివీడు రైల్వే స్టేషన్‌లో ఈ ఏడాది జూన్‌లో అకస్మాత్తుగా రిజర్వేషన్ టిక్కెట్ బుకింగ్ కౌంటర్‌ను నిలిపివేశారు. సాధారణ టిక్కెట్ల బుకింగ్ కౌంటర్‌ను కూడా నిలిపివేసి ప్రైవేట్ ఏజెన్సీకి టిక్కెట్ల విక్రయాలను అప్పగించారు. ప్రయాణికుల సంఖ్య, టిక్కెట్ల విక్రయాల పరంగా రాబడి ఉన్నప్పటికీ టిక్కెట్ బుకింగ్ కౌంటర్‌ను మూసివేయటం, రిజర్వేషన్ టిక్కెట్ల అమ్మకం పూర్తిగా నిలిపివేయటం ప్రయాణికులను విస్మయానికి గురిచేసింది.

ఇక్కడి ప్రాధాన్యం ఇదీ..

హనుమాన్‌జంక్షన్ పరిసర ప్రాంతాల్లో సుమారు 50 గ్రామాలకు నూజివీడు రైల్వేస్టేషన్ ప్రధాన రవాణా కేంద్రంగా ఉంది. జన్మభూమి, రత్నాచల్, సింహాద్రి, తిరుమల వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటుగా రాజమండ్రి- విజయవాడ, కాకినాడ- విజయవాడ ప్యాసెంజర్ రైళ్లకు ఇక్కడ హాల్ట్ ఉంది. ఈ రైల్వే స్టేషన్ నుంచి రోజుకు సగటున 600- 700 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా, నెలకు సరాసరి రూ.45 లక్షల విలువ చేసే టిక్కెట్లను విక్రయిస్తున్నట్లుగా గత ఏడాది రైల్వే శాఖ గణాంకాలు చెబుతున్నాయి. కానీ ఈ గణాంకాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా, ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా దక్షిణ మధ్య రైల్వే అర్ధంతరంగా టిక్కెట్ బుకింగ్ కౌంటర్‌ను నిలిపివేసింది. దీని స్థానంలో రైల్వే స్టేషన్‌లోని బుకింగ్ కౌంటర్ వద్ద ప్రైవేట్ వ్యక్తులకు కమీషన్ పద్ధతిపై కేవలం జనరల్ టిక్కెట్లు విక్రయించేందుకు ఏర్పాటు చేశారు.

ఇబ్బందులు ఇవీ..

దీంతో ముందస్తుగా ప్రయాణాలకు రైల్వే టిక్కెట్లను రిజర్వేషన్ చేసుకునేందుకు, తత్కాల్ టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు కానీ అవకాశం లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితుల కారణంగా హనుమాన్‌జంక్షన్ పరిసర ప్రాంత ప్రజలు రైల్వే టిక్కెట్ రిజర్వేషన్, తత్కాల్ టిక్కెట్ల కోసం ఏలూరు, గుడివాడ, విజయవాడ రైల్వే స్టేషన్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రిజర్వేషన్, తత్కాల్ టిక్కెట్ల బుకింగ్‌కు అవకాశం లేకపోవటంతో రైల్వేస్టేషన్‌లో టిక్కెట్ల ఆదాయానికి తీవ్రంగా గండి పడుతోంది. ప్రజాప్రతినిధులు స్పందించి నూజివీడు రైల్వే స్టేషన్‌లో టిక్కెట్ బుకింగ్ కౌంటర్‌ను పునరుద్ధరణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ కలేనా?

హనుమాన్‌జంక్షన్‌లోని నూజివీడు రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవటంతో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల కలగానే మిగులుతోంది. హైదరాబాద్ ప్రయాణికుల రాకపోకలకు వీలుగా ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045), గౌతమి ఎక్స్‌ప్రెస్ (12737), షిర్డీ ప్రయాణికుల కోసం షిర్డీ ఎక్స్‌ప్రెస్ (17205), తిరుపతి డబుల్ డెక్కర్, బొకారో ఎక్స్‌ప్రెస్ (13351) రైళ్లకు నూజివీడు రైల్వే స్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని పలుమార్లు స్థానికులు రైల్వే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. వీటిపై స్పందన లేకుండా పోయింది. సంస్థ మనుగడకు దోహదపడుతున్న ప్రయాణికుల గోడును పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

విధ్వంస పాలనకు చరమగీతం పాడాలి

- వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి
- వైఎస్సార్ విగ్రహ ధ్వంసం ఘటనపై నల్లబ్యాడ్జీలతో నిరసన
- నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్



వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఉయ్యూరు: కూటమి ప్రభుత్వ విధ్వంస పాలనకు చరమగీతం పాడాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రిలో దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహం ధ్వంసం చేసిన ఘటనపై నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ధ్వంసమైన విగ్రహానికి శనివారం పాలాభిషేకం చేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పట్టణ ఎస్ఐ విశ్వనాథ్‌ను కలిసి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తోందన్నారు. అరాచకాలు, విధ్వంసాలు, దాడులతో ప్రజల గొంతు నొక్కే కుట్ర చేస్తుందని ధ్వజమెత్తారు. ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశారన్నారు. వైద్యం అంటేనే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తుకు వస్తారని, ప్రజలందరి కోరిక మేరకే వైఎస్సార్ విగ్రహాన్ని ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా చేయాలే తప్ప విగ్రహాలను ధ్వంసం చేసి సాధించేది ఏమీ ఉండదన్నారు. చర్యకు ప్రతి చర్య ఉంటుందనే విషయాన్ని గుర్తెరిగి కూటమి నేతలు నడుచుకోవాలని హెచ్చరించారు. జగనన్న నాయకత్వంలో ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మండల అధ్యక్షుడు దాసే రవి, ప్రభుత్వాసుపత్రి మాజీ చైర్మన్ జంపాన కొండలరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కౌన్సిలర్ గోన మదన్, సర్పంచ్‌లు తుమ్మూరు సురేష్‌రెడ్డి, పానుగుమాటి బాలస్వామి, నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బందరు రోడ్డు పక్కన ఆక్రమణల తొలగింపు



రోడ్డు పక్కన ఆక్రమణల తొలగింపు పనులు పరిశీలిస్తున్న సీఐ వెంకటనారాయణ

పెనమలూరు: విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డు మార్జిన్ల ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి తొలగించారు. బందరు రోడ్డు పక్కనే చిరు వ్యాపారాలు చేస్తూ రోడ్డు మార్జిన్‌ను ఆక్రమిస్తున్నారు. దీని కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తడమే కాకుండా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ స్పందించి తన సిబ్బందితో బందరు రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఆక్రమణలు తీయించారు. చిరు వ్యాపారులు జాతీయ రహదారిని ఆక్రమించరాదన్నారు. దీని వలన వాహనదారులకు ప్రమాదం ఉంటుందని తెలిపారు. మరలా రహదారిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముమ్మరంగా సర్వే

ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్న సిబ్బంది



హౌస్‌హోల్డ్ సర్వే చేస్తున్న ఏఎన్ఎం ఆర్.లక్ష్మి

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల గ్రామాల్లో హౌస్‌హోల్డ్ సర్వే నిర్వహిస్తున్నారు. శనివారం నున్న గ్రామంలో సచివాలయాల్లోని వైద్యవిభాగం సిబ్బంది, అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది వారి పరిధిలో ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించి ఆన్‌లైన్లో నమోదు చేస్తున్నారు. సర్వే చేస్తున్న సిబ్బంది మొబైల్ ఫోన్లలో ఏర్పాటు చేసిన యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి, రాయనపాడు, పైడూరుపాడు, షాబాదు, గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు.

బ్యాంక్ ఖాతాల ఈకేవైసీ..

బ్యాంక్ ఖాతాలు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్‌లింక్‌తో ఈకేవైసీ చేయించుకోవాలని గ్రామ పంచాయతీ సిబ్బంది ఫోనుల్లో సమాచారం తీసుకొంటున్నారు. సామాజిక భద్రత పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారుల ఫోను నంబర్లకు ఫోను చేసి వివరాలను అడుగుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందే వారు తమ బ్యాంక్ ఖాతాల్లో నగదు బదిలీ చేసేందుకు ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలియజేస్తున్నారు.

నైపుణ్యాభివృద్ధికి నూతన విద్యా విధానం



శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులతో నిర్వాహకులు

ఉయ్యూరు: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు నూతన విద్యా విధానం దోహదపడుతుందని శ్రీ శ్రీనివాసా విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. ఉయ్యూరు శ్రీ శ్రీనివాసా అక్షరాలయం సీబీఎస్ఈ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం శనివారం ఉయ్యూరులో నిర్వహించారు. డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పరుచూరి నీలిమ జ్యోతి ప్రజ్వలన చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన విద్యా విధానం ద్వారా విద్యా ప్రగతి ముడిపడి ఉందన్నారు. ఎన్ఈపీ రీసోర్సు పర్సన్ ఎం.సీతారామయ్య, తదితరులు విద్యా విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణా జిల్లాలోని సీబీఎస్ఈ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంచేందుకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శేషగిరిరావు

ఉయ్యూరు: డ్వాక్రా మహిళల్లో అక్షరాస్యత పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ జీవీ శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 'ఉల్లాస్' కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శేషగిరిరావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో చదువు మానేసివారు, చదువు రాని సభ్యులకు చదువు నేర్పటం ఉల్లాస్ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఇందుకోసం విద్యా వలంటీర్ల నియామకానికి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. మండలంలో 32 మంది విద్యా వలంటీర్లను నియమించాల్సి ఉందన్నారు. ఫిబ్రవరి 2025 వరకూ విద్యాబోధన చేస్తారన్నారు. ఇందులో భాగంగా ఈనెల 11న మధ్యాహ్నం 2 గంటలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం ఆనందవిశ్వమోహన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు ఎంపిక

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 24వ తేదీ నుంచి గుజరాత్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌కు చెందిన స్విమ్మర్లు ఎంపికైనట్లు కోచ్ రఫీ తెలిపారు. కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కోచ్, తోటి స్విమ్మర్లు అభినందించారు. ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నర్సరావుపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్స్ గేమ్స్ చాంపియన్స్ పోటీల్లో కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన ఎస్.శ్రుతి హర్షిక వంద మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో రెండో స్థానం, రెండు వందల మీటర్ల విభాగంలో మూడో స్థానంలో నిలిచాడన్నారు. ఎస్.చంద్ర హర్షిల్ రెండు వందల మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో రెండో స్థానంలో, కె.భావేష్ 1500 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో మూడో స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు అర్హత సాధించారని వెల్లడించారు.

న్యాయ సేవాధికార చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జయలక్ష్మి



అవగాహన ర్యాలీలో జడ్జి జయలక్ష్మి, విద్యార్థులు

గన్నవరం: జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆధ్వర్యంలో గన్నవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రాయ్‌నగర్‌లోని బాలుర వసతి గృహం నుంచి ప్రారంభమైన ర్యాలీలో మండల లీగల్ సర్వీసెస్ ఆథారిటీ చైర్మన్, సీనియర్ సివిల్ కోర్టు జడ్జి కే జయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ..చట్టం దృష్టిలో అందరూ సమానులేనని చెప్పారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన పేదవర్గాలకు న్యాయ సేవలు అందించేందుకు 1995 నవంబర్ 9వ తేదీన న్యాయ సేవాధికార చట్టం తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ చట్టం ప్రకారం పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడంతో పాటు వారి వివాదాల పరిష్కారం కోసం న్యాయవాదిని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన పేద వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ఆర్.మూర్తి, ఉపాధ్యక్షుడు లోకం వేణుబాబు, కార్యదర్శి వైఆర్. శారద, హాస్టల్ వార్డెన్ ప్రకాష్, పారా లీగల్ వలంటీర్ రామినేని రవిబాబు పాల్గొన్నారు.

14న ఉచిత మధుమేహ వైద్య పరీక్షలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14న మొగల్రాజపురం రత్నమాంబ వీధిలోని మురళీకృష్ణ కేర్ అండ్ క్యూర్ హాస్పటల్, త్రినయన ఐ కేర్‌లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ టీవీ మురళీకృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకూ నిర్వహించే ఈ శిబిరంలో ఎఫ్‌బీఎస్, పీపీబీఎస్, ఆర్‌బీఎస్‌తో పాటు, హెచ్‌బీఏ1సీ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఫైబ్రో స్కాన్ (ఫ్యాటీ లివర్‌స్కాన్) చేయనున్నట్లు తెలిపారు. జనరల్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ అయిన తనతో పాటు, కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ సి.త్రివేణి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 30 వరకూ రెండు సార్లు మధుమేహం, కంటి వైద్యుల ఉచిత కన్సల్టేషన్ పొందవచ్చని తెలిపారు. తమ పేర్లు రిజిస్ట్రేషన్ కోసం 79816 43518, 62817 01748 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

అద్దె భవనంలో ఎందుకు బాబూ!

- తాడిగడప మున్సిపాలిటీకి సొంత భవనం కరువు
- గత ప్రభుత్వంలో రూ.5 కోట్లు నిధులు మంజూరు
- అందుబాటులో ప్రభుత్వ స్థలాలు
- అయినా అద్దె భవనంపైనే అధికారుల ఆసక్తి



పోరంకిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న విలువైన స్థలం



పోరంకి బీజేఆర్‌నగర్ రోడ్డులో ఉన్న స్థలం

పెనమలూరు: రాష్ట్రంలోనే ఆదాయ వనరులు పుష్కలంగా ఉన్న మున్సిపాలిటీ ఏర్పడి దాదాపు నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ సొంత భవనం లేదు. గత ప్రభుత్వంలో కార్యాలయ భవన నిర్మాణానికి రూ.5 కోట్లు నిధులు ఇచ్చినా భవన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. వివరాల్లోకి వెళితే..

తాడిగడప మున్సిపాలిటీ 2020 సంవత్సరంలో ఏర్పడింది. కానూరు, యనమలకుదురు, పోరంకి, తాడిగడప గ్రామాలను విలీనం చేసి తాడిగడప మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. విజయవాడ నగర శివారులో తాడిగడప మున్సిపాలిటీ ఉండటంతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తాడిగడప మున్సిపాలిటీ విస్తరించి శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ మున్సిపాలిటీకి సొంత భవనం నిర్మాణం నిమిత్తం గతంలో ప్రభుత్వం రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసింది. అయితే స్థల సేకరణలో జాప్యం జరగటంతో మున్సిపాలిటీ భవన నిర్మాణం జరగలేదు.

వనరులు ఉన్నా అద్దె భవనంలోనే..

తాడిగడప మున్సిపాలిటీకి పుష్కలంగా వనరులు ఉన్నా అద్దె భవనం వైపు పాలకులు మొగ్గు చూపుతున్నారు. మున్సిపాలిటీకి వార్షికంగా దాదాపు రూ.30 కోట్లకు పైగా పన్నుల రూపేణా సొమ్ము ఖజానాకు అందుతోంది. ఇతర ఆదాయం మరో రూ.10 కోట్లు జమ అవుతున్నాయి.

అందుబాటులో స్థలాలు..

మున్సిపాలిటీ పరిధిలో పోరంకిలో ఫిషరీస్ కమిషనర్ కార్యాలయం పక్కనే జాతీయ రహదారికి ఆనుకుని విలువైన స్థలం (గతంలో డంపింగ్ యార్డు) ఉంది. అదే విధంగా పోరంకి బీజేఆర్‌నగర్ రోడ్డులో మరో 43 సెంట్ల స్థలం ఉంది. ఇక్కడ సొంత భవనం నిర్మాణం చేసుకోవటానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. భవన నిర్మాణానికి రూ.3 కోట్లు వెచ్చిస్తే తాడిగడప మున్సిపాలిటీకి అన్ని వసతులతో సొంత భవనం చేకూరుతుంది. అయితే పాలకులు ఆదిశగా ప్రయత్నాలు చేయకుండా అద్దె భవనంలో కార్యాలయం ఏర్పాటు చేయాలని చూస్తున్నారు.

సొంత భవనం ఉంటే..

మున్సిపాలిటీ పాలన ఒక దగ్గరే ఉంటే ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయి. మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 2.50 లక్షల మంది జనాభా ఉన్నారు. త్వరలో మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగితే 38 మంది సభ్యులు రంగంలోకి వస్తారు. కౌన్సిల్ సమావేశాలకు హాల్, కౌన్సిలర్లకు వసతులు ఉంటాయి. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయటానికి అవకాశం ఉంటుంది. అద్దె భారం కూడా తగ్గుతుంది. సొంత స్థలాలు అందుబాటులో ఉన్నందున పాలకులు సొంత భవనం నిర్మాణం చేయాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

చిన్నారుల చిరునవ్వే లక్ష్యం

- ఇప్పటి వరకు గ్రహణం మొర్రి, అంగిలి చీలికైన 300 మంది చిన్నారులకు ఆపరేషన్ల పూర్తి
- చినఅవుటపల్లి డెంటల్ కళాశాల వైద్య బృందం



చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ప్రిన్సిపాల్ డాక్టర్ రామోజీరావు, వైద్య బృందం

గన్నవరం రూరల్: గ్రహణం మొర్రి, అంగిలి చీలిక పెదవులపై చిరునవ్వులు లక్ష్యంగా తాము పని చేస్తున్నట్లు చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంటీ రామోజీరావు, ఓరల్ సర్జరీ హెచ్ఓడీ ఎస్.కోటేశ్వరరావు పేర్కొన్నారు. డెంటల్ కళాశాల సారథ్యంలో స్మైల్ ట్రయిన్ ఇండియా, ఏపీ ప్రభుత్వ సంయుక్త సహకారంతో ఇప్పటికీ 300 ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగిలి చీలిక, గ్రహణం మొర్రితో ఇబ్బందులు పడుతున్న రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రులకు అవగాహన నిర్వహించి భరోసా కల్పించారు.

ఎలాంటి ఖర్చు లేకుండా ఆపరేషన్లు..

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఏ వయసు వారికైనా ఈ ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిద్ధార్థ అకాడమీ ఈ యజ్ఞానికి పూర్తి సహకారం అందిస్తోందన్నారు. అంగిలి చీలిక, గ్రహణం మొర్రితో చిన్నారులు వెనుకబడిపోతారని, వారిలో ఆత్మస్థైర్యం పెంచి వారి ముఖాలపై చిరునవ్వులు, తల్లిదండ్రులలో ధైర్యం నింపటం బాధ్యతగా నిర్వహిస్తున్నామని,అందరూ వినియోగించుకోవాలని చెప్పారు. తమ కళాశాలలో పూర్తి వసతులు ఉన్నాయన్నారు. లక్షల రూపాయలు ఖర్చు అయ్యే ఈ ఆపరేషన్లకు ఖర్చు లేకుండా చేస్తున్నామన్నారు. ఆర్థోడాంటిక్స్ సహకారంతో క్లిప్‌లను సైతం తామే అందజేస్తున్నట్లు, చిన్నారుల్లో సర్జరీకి ముందు పోషకాహారం అందించేందుకు న్యూట్రిషనల్ సపోర్టు కూడా ప్రభుత్వం, స్మైల్ ట్రైన్ ఇండియా అందజేస్తున్నాయని చెప్పారు. 300 ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించిన తమ వైద్య బృందానికి, యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో గ్రహణం మొర్రి, అంగిలి చీలికతో ఇబ్బందులు పడు తున్న వారందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఏఓ వై.మధుసూదనరావు, సర్జన్ డాక్టర్ గుంటూరు శ్రీకాంత్, ఆర్థోడాంటిక్స్ హెచ్ఓడీ డాక్టర్ దొడ్డా కిరణ్, డాక్టర్ రవిచంద్రశేఖర్, డాక్టర్ మృదుల పాల్గొన్నారు.

నేడు ధన్వంతరి జయంతి



ఎమ్మెల్యే బోడెప్రసాద్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘ నేతలు

పెనమలూరు: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో భగవాన్ ధన్వంతరి జయంతి ఉత్సవాలు ఆదివారం నిర్వహిస్తున్నామని నాయీబ్రాహ్మణ సంఘ నేతలు వణుకూరు సురేష్‌బాబు, ఆకునూరు సుబ్బారావు తెలిపారు. పోరంకిలో శనివారం ఎమ్మెల్యే బోడెప్రసాద్‌కు జయంతి ఉత్సవాల ఆహ్వానపత్రిక అందజేసి వివరాలు తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం ధన్వంతరి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు పాల్గొంటారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ఉత్సవాలలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు ఆకునూరు బసవరాజు, పరస బాలకృష్ణ, వణుకూరు మారుతి, ఇంటూరి మురళి, వక్కలగడ్డ శివ నాగేంద్ర, అన్నవరపు శివపార్వతి పలువురు పాల్గొన్నారు.